ఏపీలో పంచాయితీ రాజ్ వ్యవస్థ

ప్రజలందరూ అధికారంలో పాలుపంచుకోవడాన్ని ప్రజాస్వామ్య పరిపాలన అంటారు. పరిపాలన వికేంద్రీకరణతోనే దేశంలో పాలన సమర్థవంతంగా సాగుతుంది.

పరిపాలన సౌలభ్యం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై పని భారాన్ని తగ్గించి స్థానిక సంస్థలను ఏర్పాటు చేయాలి. సమాజ వికాస ప్రయోగాలను, జాతీయ విస్తరణ సేవా పథకాల అమలు తీరును పర్యవేక్షించి తగిన సూచనలు ఇవ్వడానికి 1957 జనవరిలో ప్రణాళికా ప్రాజెక్ట్ కమిటీ బల్వంత్‌రాయ్ గోపాల్ మెహతా కమిటీని నియమించింది. 1957 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వానికి కమిటీ నివేదికను సమర్పించగా 1958 జనవరిలో జాతీయాభివృద్ధి మండలి దానిని ఆమోదించింది.

సామాజికాభివృద్ధి పథకం

అక్టోబర్ 2, 1952లో సమాజ వికాస ప్రయోగంలో భాగంగా సామాజికాభివృద్ధి పథకం అమల్లోకి వచ్చింది. భారతదేశానికి పల్లెలే పట్టు గొమ్మలని, గ్రామ రాజ్యం ద్వారానే రామ రాజ్యం సాధ్యమవుతుందని భావించిన జాతిపిత మహాత్మాగాంధీ జన్మదినం సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించారు. జాతి నిర్మాణంలో ప్రజలను భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో స్వాతంత్ర్యానంతరం సామాజికాభి వృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి కేంద్రీకరించాయి. వి.టి.కృష్ణమాచారి సూచనలను అనుసరించి ప్రవేశపెట్టిన ఈ పథకంలో వ్యవసాయాభివృద్ధి, చిన్నతరహా, కుటీర పరిశ్రమల అభివృద్ధి, ప్రజారోగ్యం, విద్య, రవాణా లాంటి ప్రాథమిక, మౌలిక అంశాలపై కేంద్రీకరించారు. అమెరికాలో అమల్లో ఉన్న బ్లాక్ డెవలప్‌మెంట్ నమూనాను మనదేశంలో కూడా అనుసరించారు. అందుకు ప్రారంభంలో అమెరికాకు చెందిన ఫోర్డ్ ఫౌండేషన్ ఆర్థిక సహాయాన్ని అందించింది.

జాతీయ విస్తరణ సేవా పథకం

సామాజికాభివృద్ధి పథకాన్ని దేశం మొత్తానికి విస్తరించాలని కేంద్ర ప్రభుత్వం భావించింది. అందుకు అనుగుణంగా 1953లో సీడీపీకి అనుబంధంగా జాతీయ విస్తరణ సేవా పథకాన్ని ప్రారంభించింది. దానిలో భాగంగా మనదేశంలో ఈ పథకాల అమలును, ప్రణాళికా లక్ష్యాల అమలును పర్యవేక్షించడానికి క్రమానుగత శ్రేణి విధానాన్ని ప్రవేశపెట్టింది. కానీ ఇవన్నీ అనుకున్న లక్ష్యాలను సాధించలేక పోయాయి. దాంతో ఈ పథకాల అమలు తీరుపై సరైన అధ్యయనం చేసి తగు సూచనలు ఇవ్వడానికి బల్వంత్‌రాయ్ మెహతా కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించింది.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనలు

- ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలి. తద్వారా పథకాలకు విలువ, సార్థకత పెరుగుతుంది.
- ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సిద్ధాంత ప్రాతిపదికపై పంచాయితీ రాజ్ వ్యవస్థను మూడంచెల పద్ధతిలో నెలకొల్పాలి.

  జిల్లా పరిషత్: అభివృద్ధి విషయంలో ఒక యూనిట్‌గా భావించే దీనికి కలెక్టర్‌ను చైర్మన్‌గా పరోక్ష పద్ధతిపై ఎన్నుకోవాలి.

  పంచాయితీ సమితి: అప్పటికే బ్లాక్ వ్యవస్థ ఉన్నందున అక్కడ పంచాయితీ సమితిని నెలకొల్పి దాని అధ్యక్షులను కూడా పరోక్షంగా ఎన్నుకోవాలి.

  గ్రామ పంచాయితీ: పంచాయితీరాజ్ వ్యవస్థకు, స్థానిక స్వపరిపాలనకు ప్రాతిపదికగా పేర్కొనే గ్రామపంచాయితీలకు ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిపై నిర్వహించాలి.
- స్థానిక సంస్థలు రాజకీయాలకు అతీతంగా పనిచేయాలంటే వాటికి ఎన్నికలను స్వతంత్ర ప్రాతిపదికపై నిర్వహించాలి.
- ప్రభుత్వ ఆర్థిక, సామాజికాభివృద్ధి పథకాలన్నీ స్థానిక స్వపరిపాలన సంస్థల ద్వారానే నిర్వహించాలి.
- భవిష్యత్‌లో అధికారాల బదిలీకి, బాధ్యతల నిర్వహణకు స్థానిక సంస్థలు పరిపాలన ప్రాతిపదికలుగా పనిచేయాలి.
- విధాన నిర్ణయాల్లో భాగస్వామ్యం, పరిపాలనలో భాగస్వామ్యం, ప్రజలు తమను తామే పరిపాలించుకునే సంస్థలుగా పని చేయాలి.
- స్థానిక సంస్థలు సమర్థవంతంగా పని చేయాలంటే వాటికి అధికారాలు కల్పించడంతో పాటు తగినన్ని నిధులను కేటాయించాలి. గ్రామస్థాయిలో సంస్థ పైస్థాయిలోని పంచాయితీ సమితీకి, వాటిని జిల్లా పరిషత్‌కు అనుసంధానం చేయాలి.

బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచనలను మొదట రాజస్థాన్‌లో తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేశారు. స్థానిక పాలన అంశం రాష్ట్ర జాబితాలో ఉన్నందున అన్ని రాష్ట్రాల్లో ఒకేవిధంగా కాకుండా ఆయా రాష్ట్రాల పరిస్థితులననుసరించి కొద్దిపాటి మార్పులతో వేర్వేరుగా అమలు చేశారు. పశ్చిమబెంగాల్‌లో నాలుగంచెల వ్యవస్థను, జమ్మూ అండ్ కాశ్మీర్, అస్సాంలలో రెండంచెల వ్యవస్థను, రాజస్థాన్, ఏపీలలో మూడంచెల వ్యవస్థను ఏర్పాటు చేశారు.

స్థానిక సంస్థల చరిత్రను ఐదు దశల్లో అధ్యయనం చేయొచ్చు.

1. ఏర్పాటు దశ – 1959–1964
2. స్థబ్ద దశ – 1964–1969
3. పతన దశ – 1969–1978
4. పునరుజ్జీవన దశ 1978–1992

5. రాజ్యాంగ ప్రతిపత్తి 1992 తరువాత

కమిటీలు -సూచనలు

భారతదేశంలో స్థానిక సంస్థల ఏర్పాటుకు బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సిఫార్సులు మూలం అయినప్పటికీ నేడున్న దశకు పంచాయితీరాజ్ వ్యవస్థ పరిణామం చెందడానికి అనేక కమిటీలు కూడా దోహదపడ్డాయి.

- పంచాయితీరాజ్ సంస్థల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరచడానికి కె.సంతానం కమిటీని 1963లో ఏర్పాటు చేశారు. 1965లో ఎన్నికల వ్యవస్థపై కూడా ఈ కమిటీ అనేక సిఫార్సులను చేసింది.
- కలెక్టర్ జిల్లా పరిపాలన ముఖ్య అధికారిగా వ్యవహరించాలని వెంగళరావు కమిటీ పేర్కొంది.
- స్థానిక సంస్థల్లో రాజకీయాల జోక్యం ఉండరాదని, రాజకీయాల వల్ల అభివృద్ధి ఆగిపోతుందని నర్సింహ్మం కమిటీ పేర్కొంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు పంచాయితీరాజ్ సంస్థల్లో జోక్యం చేసుకోరాదని సూచించింది.
- మన రాష్ట్రంలో ప్రారంభంలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌లను పరోక్ష పద్ధతిలో ఎన్నుకోగా ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతిని ప్రవేశపెట్టాలని దంత్‌వాలా కమిటీ సూచించింది.
- పంచాయితీరాజ్ వ్యవస్థ తరహాలో న్యాయ పంచాయితీలను ఏర్పాటు చేయాలని జి.ఆర్. గోపాల్ కమిటీ సూచించింది.
- సమాజ వికాస ప్రయోగం పంచాయితీరాజ్ వ్యవస్థపై అధ్యయనం చేసిన దయా చౌబే కమిటీ 1976లో తన నివేదికను సమర్పించింది.

మాదిరి ప్రశ్నలు

1. ప్రస్తుతమున్న పంచాయితీరాజ్ వ్యవస్థకు మూలమైన కమిటీ? (గ్రూప్-1, 1999)

ఎ) అశోక్ మెహతా బి) బల్వంత్‌రాయ్ మెహతా
సి) వసంతరావ్ నాయక్ డి) రాజమన్నార్

2. మొదటిసారి భారతదేశంలో పంచాయితీరాజ్ వ్యవస్థ ప్రవేశపెట్టాలని సూచించిన కమిటీ? (గ్రూప్-1, 1995)

ఎ) అశోక్ మెహతా బి) విఠల్
సి) జి.వి.కె. రావు డి) బల్వంత్‌రాయ్

3. బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ దేనికి సంబంధించింది? (గ్రూప్-1, 1991)

ఎ) పంచాయితీరాజ్ బి) సమాజ వికాసం
సి) ప్రణాళికా సంఘం డి) మండల పరిషత్

4. సామాజికాభివృద్ధి పథకం లక్ష్యం? (సివిల్స్-1999)

ఎ) ప్రాంతం ప్రాతిపదికగా గ్రామీణ ప్రజల ఆర్థికాభివృద్ధి
బి) ప్రాంతం ప్రాతిపదికగా గ్రామీణ ప్రజల సాంస్కృతికాభివృద్ధి
సి) ప్రాంతం ప్రాతిపదికగా గ్రామీణ ప్రజల ఆర్థిక, సాంస్కృతికాభివృద్ధి
డి) పైన పేర్కొన్న వాటిలో ఏదీ కాదు

5. సామాజికాభివృద్ధి పథకం, జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పనితీరును మెరుగుపరచడానికి బల్వంత్‌రాయ్ మెహతా అధ్యయన బృందం సూచించిన పంచాయతీ రాజ్ వ్యవస్థ? (సివిల్స్-1994)

ఎ) రెండంచెల బి) మూడంచెల
సి) నాలుగంచెల డి) అయిదంచెల

6. పంచాయితీరాజ్‌కు సంబంధించి దిగువవాటిలో అశోక్ మెహతా కమిటీ సిఫార్సు కానిది?

ఎ) పంచాయితీరాజ్‌లో రాజకీయ పార్టీలు ప్రత్యక్షంగా పాల్గొనడం
బి) రెండంచెల పంచాయితీరాజ్ ఉంటే మంచిది
సి) రాజ్యాంగపరమైన రక్షణ
డి) జిల్లా పరిషత్‌కు పరిమిత అభివృద్ధి కార్యక్రమ విధులు

7. పంచాయితీరాజ్‌పై అశోక్‌మెహతా కమిటీని నియమించినపుడు భారత ప్రధాన మంత్రి ఎవరు? (గ్రూప్-2, 2008)

ఎ) ఇందిరాగాంధీ బి) మొరార్జీదేశాయ్
సి) చరణ్‌సింగ్ డి) వి.పి. సింగ్

8. అశోక్ మెహతా కమిటీ పంచాయితీరాజ్ వ్యవస్థకు ఎన్ని అంచెల విధానాన్ని సూచించింది? (గ్రూప్-2, 2008)

ఎ) 3 బి) 4 సి) 1 డి) 2

9. పంచాయితీరాజ్ ఆర్థిక పరిశీలన కోసం 1963లో నియమించిన కమిటీ?

ఎ) కె. సంతానం బి) ఎం.పి. పాయ్
సి) సిహెచ్. హనుమంతరావు డి) జి.వి.కె. రావు

సమాధానాలు

1	బి	2	డి	3	ఎ	4	సి	5	బి
6	డి	7	బి	8	డి	9	ఎ		

పంచాయతీ వ్యవస్థలను అభివృద్ధిపరచాలని, ప్రజలు తమంతట తాముగా పాలనలో భాగం కావాలని, సహాయం పొందాలని ప్రణాళిక సంఘం సిఫార్సులు చేసింది. ప్రణాళిక ప్రాజెక్ట్ కమిటీ 1957 జనవరిలో బల్వంత్‌రాయ్ గోపాల్ జి. మెహతా. అధ్యక్షతన ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సమాజ వికాస ప్రయోగాలను, జాతీయ విస్తరణ బ్లాకుల పనితీరును పరిశీలించి సూచనలివ్వటం దీని ప్రధాన ఉద్దేశం. 1957 నవంబర్‌లో ఈ కమిటీ తన నివేదికను కేంద్రానికి సమర్పించింది. 1958లో కేంద్రం రాష్ట్రాలకు సమర్పించింది. ఈ నమూనా 1958లో జాతీయ అభివృద్ధి మండలి ఆమోదం పొందింది. 1959 అక్టోబర్ 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో ఈ కమిటీ నమూనాను నెహ్రూ ప్రారంభించారు. ఈ నమూనాను మొదట తయారుచేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

సిఫార్సులు..

- మూడంచెల పద్ధతిని ప్రవేశపెట్టాలి–జిల్లా స్థాయిలో జిల్లా పరిషత్, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, గ్రామ స్థాయిలో పంచాయతీ.
- గ్రామ పంచాయతీలో సభ్యులను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. పంచాయతీ సమితి, జిల్లా పరిషత్ సభ్యులను పరోక్షంగా ఎన్నుకోవాలి
- ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాలను ఈ సంస్థలకు అప్పగించాలి
- కలెక్టర్ జిల్లా పరిషత్‌కు అధ్యక్షుడుగా ఉండాలి
- పంచాయతీ సమితి కార్యనిర్వాహక సంస్థగా ఉండాలి
- వనరులను, సంస్థలకు తగినవిధంగా బదిలీ చేయాలి

అమలు చేసిన రాష్ట్రాలు:

మూడంచెల పద్ధతిని ప్రవేశపెట్టిన రాష్ట్రాలు: ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, బీహార్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్

రెండంచెల పద్ధతిని అమలు చేసిన రాష్ట్రాలు: అస్సాం, హర్యానా, మణిపూర్, ఒరిస్సా

ఒకే స్థాయిని అమలు చేసినవి: గోవా, జమ్మూ–కాశ్మీర్, కేరళ, సిక్కిం, త్రిపుర, అండమాన్–నికోబార్ దీవులు, దాద్రా–నగర్ హవేలి, డామన్–డయ్యూ, ఢిల్లీ, పాండిచ్చేరి

అమలు చేయని రాష్ట్రాలు: మేఘాలయ, నాగాలాండ్

- మార్చి 31, 1990 నాటికి దేశంలో 2,17,300 గ్రామ పంచాయతీలు; 4,525 పంచాయతీ సమితులు, 330 జిల్లా పరిషత్‌లు ఉన్నాయి.
- ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 21,943 గ్రామ పంచాయతీలున్నాయి

గ్రామ పంచాయత్ – నిర్మాణం

- గ్రామాన్ని కొన్ని వార్డులుగా విభజిస్తారు. ఒక్కో సభ్యుడిని వార్డులోని ప్రజలు ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. ఇలా ఎన్నికైన సభ్యులు పంచాయితీ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు.
- ఒక్కో పంచాయతీ జనాభాను బట్టి 5 నంచి 31 వరకు పంచాయతీ సభ్యులు ఉంటారు
- పంచాయితీ అధ్యక్షుడిని వివిధ రాష్ట్రాల్లో ఛైర్మన్ లేదా సర్పంచ్ / ప్రధాన్/ముఖ్య/అధ్యక్షుడుగా పిలుస్తారు. సాధారణంగా వీరి పదవీ కాలం ఐదేళ్లు. అస్సాం, కర్ణాటక, పశ్చిమ బెంగాల్‌లో పంచాయతీ సమితీ పదవీకాలం నాలుగేళ్లు. ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్‌లలో మూడేళ్లు, హర్యానా, కేరళ, పంజాబ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్‌లలో అయిదేళ్లు.

పంచాయతీ విధులు రెండు రకాలు

1.తప్పనిసరి విధులు 2. విచక్షణ విధులు

తప్పనిసరి విధులు: పారిశుద్ధ్యం, నీటి సరఫరా చేయడం, విద్యుద్దీపాలను వెలిగించడం, స్నానఘట్టాలను ఏర్పాటు చేయడం, గ్రంథాలయాలను స్థాపించడం, పన్నులను వసూలు చేయడం, జననమరణాల్ని రిజిస్ట్రేషన్ చేయడం మొదలైనవి.

విచక్షణ విధులు: ఆట స్థలాలు, కమ్యూనిటీ కేంద్రాలను నిర్మించడం, మొక్కలను నాటడం, గ్రామీణ పరిశ్రమలను స్థాపించడం, పశుగణాభివృద్ధిని పెంచడం మొదలైనవి.

ఆదాయమార్గాలు: పంచాయితీలకు వివిధ పన్నులు (ఆస్తి, సేవ పన్ను, భూ ఆదాయం, వాణిజ్య, వర్తక పన్నులు), ఫీజులు, అపరాధ రుసుములు, ప్రభుత్వ గ్రాంటుల ద్వారా ఆదాయం చేకూరుతుంది.

పంచాయతీ సమితి

ఈ పద్ధతి బ్లాకు స్థాయిలో ఉంటుంది. పంచాయతీ సమితిని వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. ఆంధ్రప్రదేశ్, బీహార్, హర్యానా, పంజాబ్, మహారాష్ట్ర, ఒరిస్సా, రాజస్థాన్ రాష్ట్రాల్లో పంచాయితీ సమితి అని అంటారు. ఆయా రాష్ట్రాల్లో దీని పదవీకాలం మూడు నుంచి ఐదేళ్లుగా ఉంది. అస్సాంలో అంబాలిక్ పంచాయతీ, గుజరాత్‌లో తాలుకా పంచాయతీ, కర్ణాటకలో తాలుకా డెవలప్‌మెంట్ బోర్డ్, మధ్య ప్రదేశ్‌లో జనపద పంచాయతీ, తమిళనాడులో పంచాయతీ యూనియన్ కౌన్సిల్, ఉత్తరప్రదేశ్‌లో క్షేత్రసమితి అని పిలుస్తారు.

ఆంధ్రప్రదేశ్, అస్సాం, బీహార్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో సభ్యులు పదవీకాలం మూడేళ్లు. గుజరాత్, కర్ణాటక, ఒరిస్సా, పశ్చిమబెంగాల్‌లో నాలుగేళ్లు, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్‌లలో ఐదేళ్లు.

నిర్మాణం: బ్లాకు స్థాయిలో ఏర్పడుతుంది. సమితిలో ఎన్నికైన సభ్యులు, కో ఆప్టెడ్ సభ్యులు (స్త్రీలు, షెడ్యూల్డ్ కులాలు, తరగతులకు చెందినవారు) ఉంటారు. సభ్యులు అధ్యక్షుడిని పరోక్షంగా ఎన్నుకుంటారు.

విధులు: వ్యవసాయ ప్రణాళికలను తయారు చేయడం. ప్రజా ఆరోగ్య కేంద్రాల్ని నిర్మించడం, నిర్వహించడం.

- విద్యాసంస్థలు, గ్రంథాలయాలను నెలకొల్పడం, నిర్వహించడం.
- రహదారులు వేయడం
- వ్యవసాయం, ఇరిగేషన్, పరిశ్రమలలో పరపతి సౌకర్యాన్ని కల్పించడం
- సమితి పరిధిలోని కార్యక్రమాలను పర్యవేక్షించడం మొదలైనవి

వనరులు: గ్రాంటులు, ఫీజులు, విరాళాలు,పన్నులు మొదలైనవి

బ్లాకు డెవలప్‌మెంట్ అధికారి: పంచాయితీ సమితికి ముఖ్య కార్యనిర్వాహకుడు బ్లాకు డెవలప్‌మెంట్ అధికారి. సమితి కార్యక్రమాలను నిర్వహించడం, బడ్జెట్, ప్రణాళికలను తయారు చేయడం, తన పరిధిలోని వ్యవస్థలను, గ్రామ పంచాయితీలను తనిఖీ చేయటం, ప్రభుత్వానికి, జిల్లా పరిషత్‌కు నివేదికలను పంపడం మొదలైనవి బ్లాక్ డెవలప్‌మెంట్ అధికారి విధులు.

జిల్లా పరిషత్

జిల్లా పరిషత్‌ను వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలుస్తారు. పంజాబ్, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో జిల్లా పరిషత్, కర్ణాటక, తమిళనాడులో జిల్లా అభివృద్ధి కౌన్సిల్, అస్సాంలో మోక్మా పరిషత్‌గా పిలుస్తున్నారు. రాష్ట్రంలో 22 జిల్లా పరిషత్‌లున్నాయి.

నిర్మాణం: జిల్లా పరిషత్ పరిధిలోని వివిధ సమితుల అధ్యక్షులు, చైర్మన్‌లు, పార్లమెంట్ సభ్యులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, కో ఆప్టెడ్ సభ్యులు, పరపతి సొసైటీలు, మున్సిపాలిటీలు, నోటిఫైడ్ ఏరియా కమిటీల ప్రతినిధులు మొదలైనవారు ఇందులో సభ్యులుగా ఉంటారు.

జిల్లా పరిషత్ అధ్యక్షుడు: జిల్లా పరిషత్ అధ్యక్షులను అస్సాం, గుజరాత్, మహారాష్ట్రల్లో ప్రెసిడెంట్ అని, బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో అధ్యక్ష అని, ఆంధ్రప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో చైర్మన్ అని పిలుస్తారు. వీరి పదవీ కాలం అయిదేళ్లు.

విధులు: ప్రభుత్వం, పంచాయితీ సంస్థలకు మధ్య సంధానకర్తగా ఉండటం

- సమితి కార్యక్రమాలన్నీ పర్యవేక్షించి, సమన్వయానికి తోడ్పడటం
- సమితి బడ్జెట్‌లను పరీక్షించడం
- ప్రభుత్వ గ్రాంటులను సమితుల మధ్య పంపిణీ చేయడం
- పంచాయతీ, సమితి కార్యక్రమాలలో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందిచడం.

ఆదాయమార్గాలు: ప్రభుత్వ గ్రాంటులు, పన్నులు (వృత్తి, వాణిజ్య, నీటి పన్ను..), వివిధ రకాల లైసెన్స్ ఫీజులు, ప్రభుత్వం నుంచి అప్పులు..

ప్రాక్టీస్ ప్రశ్నలు...

1.బల్వంతరాయ్ నమూనాను (మూడంచెల పద్ధతిని) మొట్టమొదటిగా తయారు చేసిన రాష్ట్రం?

ఎ) రాజస్థాన్ బి) ఆంధ్రప్రదేశ్
సి) కర్ణాటక డి) మహారాష్ట్ర

2.రెండంచెల పద్ధతిని అమలు చేసిన రాష్ట్రం?

ఎ) అరుణాచల్‌ప్రదేశ్ బి) మధ్యప్రదేశ్
సి) మణిపూర్ డి) పంజాబ్

3.ఏ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పదవీకాలం నాలుగు ఏళ్లు?

ఎ) ఒరిస్సా బి) కేరళ
సి) పశ్చిమబెంగాల్ డి) ఉత్తరప్రదేశ్

4.పంచాయిత్ యూనియన్ కౌన్సిల్ ఉన్న రాష్ట్రం?

ఎ) బీహార్ బి) రాజస్థాన్
సి) ఒరిస్సా డి) తమిళనాడు

5.పంచాయితీ సమితికి లేని విధి?

ఎ) మొక్కలను నాటడం
బి) పశుగణాభివృద్ధిని పెంచడం
సి) రహదారులను మెరుగుపరచడం
డి) జూనియర్ కాలేజీలను నిర్వహించడం

6.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న గ్రామపంచాయితీలు?

ఎ) 21,943 బి) 20,943
సి) 21,843 డి) 22,943

7.ఏ రాష్ట్రంలో జిల్లా పరిషత్‌ను మోక్మా పరిషత్‌గా పిలుస్తారు?

ఎ) అస్సాం బి) ఆంధ్రప్రదేశ్
సి) రాజస్థాన్ డి) కర్ణాటక

8.బల్వంత్‌రాయ్ మూడంచెల పద్ధతిని (నమూనాను) జాతీయాభివృద్ధి మండలి ఎప్పుడు ఆమోదించింది?

ఎ) జనవరి, 1957 బి) జనవరి, 1958
సి) జనవరి, 1959 డి) ఫిబ్రవరి, 1958

జవాబులు	1	2	3	4	5	6	7	8
	B	C	C	D	D	A	A	B